క్లుప్తంగా

అందుబాటులో జొన్న విత్తనాలు

కోయిల్‌కొండ: కోయిల్‌కొండ, అంకిళ్ల, అభంగ పట్నం పశువైద్య కేంద్రాలలో ఎస్‌ఎస్‌జీ–898 రకం జొన్న విత్తనాలు 75శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయని ఆసక్తి గల పాడి రైతులు తీసుకెళ్లాలని పశువైద్యశాఖ అధికారులు తెలిపారు. 5కేజీల బస్తా రూ.243 ఉండగా సబ్సిడీ పోనూ రూ.60అందించడం అందిస్తున్నట్లు తెలిపారు.

యాత్రకు భారీగా తరలిరండి

జడ్చర్ల: రవాణా రంగం కార్మికుల సంఘర్ష యాత్ర ఈనెల 3 నుంచి 11 వరకు ఉంటుందని, యాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య కోరారు. సోమవారం స్థానిక డీసీఎం ఓనర్స్ సోసియేషన్ కార్యాలయం వద్ద సంఘర్ష యాత్రకు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.

4 నుంచి లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు



మిడ్జిల్: మండలంలోని వెలుగొమ్ముల లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం పల్లకీసేవ, ధ్వజారోహణం, అఖండ దీపారాధన, 5వ తేదీ గురువారం కల్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమం, 6వ తేదీ శుక్రవారం పంచామృతాభిషేకం, రాత్రికి రథోత్సవం, 7వతేదీ శనివారం సాయంత్రం శకటోత్సవం, 8వ తేదీ ఆదివారం చక్రతీర్థస్నానం, రాత్రికి దీపోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలి

కోయిల్‌కొండ: విద్యార్థులు తమకు అనుకూలమైన క్రీడారంగంలో రాణిస్తే మంచి భవిష్యత్‌తోపాటు, సమాజంలో గుర్తింపు లభిస్తుందని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుభాష్ చంద్రబోస్ అన్నారు. గత నెల 27, 31వ తేదీ వరకు చైన్నైలోని టీఎన్‌పీఈఎస్ యూనివర్సిటీలో నిర్వహించిన సబ్‌జూనియర్ నేషనల్ టార్గెట్ బాల్ క్రీడల్లో బీసీ గురుకుల పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సోమవారం వారిని పాఠశాల ఉపాధ్యాయబృందం అభినందించారు.

విధుల్లో చేరిన వైద్యాధికారులు



అడ్డాకుల: మూసాపేట మండలంలోని జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్‌గా షబానాబేగం నియమితులయ్యారు. ఇంతకు ముందు ఆమె దేవరకద్ర పీహెచ్‌సీలో వైద్యురాలిగా పనిచేసేది. కాగా జానంపేటలో పనిచేసే మెడికల్ ఆఫీసర్ శ్వేతా రెడ్డి హన్వాడకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఈమెను కేటాయించారు. సోమవారం ఆమె ఆస్పత్రిలో విధుల్లో చేరి బాధ్యతలు చేపట్టారు. ఇదిలా ఉండగా అడ్డాకుల పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఉదయ్‌రాజ్ వరంగల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో జడ్చర్ల అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యుడిగా పని చేసే శివకాంత్ అడ్డాకులలో విధుల్లో చేరినట్లు సీహెచ్‌ఓ భాస్కర్ తెలిపారు.

దాతలు చేయూతనందించాలి



అడ్డాకుల: మండలంలోని నిజాలాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం బాలబాలికలకు టై, బెల్టులను గ్రామానికి చెందిన శ్రీనివాసులు సమకూర్చగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సత్యమ్మ, ఎంపీటీసీ సభ్యుడు సీజీ గోవర్ధన్ సాగర్ విద్యార్థులకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల అభ్యున్నతికి దాతలు, పూర్వ విద్యార్థులు చేయూతనందించాలని వారు పిలుపునిచ్చారు.

8న ఎస్సెస్సీ మోడల్ టెస్టు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించే ఎస్సెస్సీ మోడల్ టెస్టును విజయవంతం చేయాలని డాక్టర్ ప్రతిభ పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో మోడల్ టెస్టుకు సంబంధించిన కరపత్రాన్ని ఆమె సోమవారం ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యల కోసం నిరంతరం పోరాడే సంఘం, ప్రతిభను గుర్తించేందుకు పరీక్ష నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. జిల్లా కేంద్రంలోని వాగ్దేవి కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉదయం 10గంటలకు నిర్వహించే పరీక్షలకు పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరుకావాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భరత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

● ఉత్తరద్వార దర్శనంతో తరించిన భక్తులు ● దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా వ్యాప్తంగా పలు వైష్ణవాలయాలకు భక్తులు పోటెత్తారు. ఆయా ఆలయాలు కిటకిటలాడాయి. ఆలయ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం ఉత్తర ద్వారాల నుంచి ప్రవేశం కల్పించటంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పలు ఆలయాల్లో పారాయణాలు, ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని కాటన్‌మిల్లు లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో తెల్లవారుజాము నుంచే దర్శనానికి భక్తులను అనుమతించారు. సింహగిరి లక్ష్మీనసింహస్వామి దేవస్థానంలో ఉత్తరద్వారం నుంచి దర్శనానికి అనుమతించారు. టీడీ గుట్ట తిరుమలనాథస్వామి దేవాలయంలో ఉత్తరద్వార ప్రత్యేక దర్శనం కోసం భక్తులు వేకువజాము నుంచి క్యూలో నిల్చున్నారు. శ్రీనివాసకాలనీలోని పంచముఖాంజనేయస్వామి సమూహాలయాల్లోని వేంకటేశుని సన్నిధికి భక్తులు అధికంగా తరలివచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణ మండపంలో ఏకాదశి సందర్భంగా శ్రీవారికి అభిషేకం నిర్వహించారు. రాజస్థాన్ మహిళా సమాజం, వేంకటేశ్వర మహిళా సత్సంగ్ ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామపారాయణం చేపట్టారు. **- సాక్షి, నెట్‌వర్క్**



జిల్లా కేంద్రంలో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బారులు తీరిన భక్తులు



ఆలయంలో నమస్కరిస్తున్న మహిళ



ప్రసాదాల పంపిణీ..



జిల్లా కేంద్రంలో టీటీడీ కల్యాణ మండపంలో..



కోయిల్‌కొండ శ్రీరామకొండ క్షేత్రంలో..



జడ్చర్లలో క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు



నవాబుపేట మండలం మరికల్ వేంకటేశ్వర దేవాలయంలో..



జిల్లా కేంద్రంలో ఉత్తరద్వారం నుంచి వెళ్తున్న భక్తులు



జిల్లా కేంద్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో..



ఆలయంలో నమస్కరిస్తున్న మహిళలు



జిల్లా కేంద్రంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

నాణ్యతగా అభివృద్ధి పనులు



జడ్చర్లలో పీహెచ్‌సీ భవన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పెద్ద ఆదిరాలలో నిర్మిస్తున్న 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి పనులను ఆయన తనిఖీ చేశారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అన్ని సౌకర్యాలతో భవనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, రాంలింగారెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు మేనమామ కేసీఆర్

మిడ్జిల్: నిరుపేదల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా ఆడపిల్లల కుటుంబాలకు మేనమామలాగ ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో, వివిధ గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు అదేవిధంగా సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను అందించారు. ఎంపీపీ కాంతమ్మ, జెడ్పీటీసీ శశిరేఖా, తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సుదర్శన్, సర్పంచ్ జంగయ్య పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

బాలానగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరే విధంగా రూపకల్పన చేయడంతో పాటు వాటిని 100 శాతం అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 80 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు, సీఎంఆర్‌ఎఫ్ కింద 9 మంది బాధితులకు చెక్కులను పంపిణీ పంపిణీ చేశారు. దేశంలో కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సైతం లేని ఎన్నో సంక్షేమ పథకాలు తెలంగాణలో నిర్విరామంగా అమలు అవుతున్న ఘనంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చెందిందని అన్నారు. గతంలో నియోజకవర్గంలో 200 తండాలు ఉండగా కేవలం 4 తండాలలో మాత్రమే ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు ఉండేవన్నారు. ప్రస్తుతం ప్రతి మారుమూల తండాలలో సైతం ట్యాంకు నిర్మించి తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ గిరిజన కోపరేటివ్ చైర్మన్ వాల్యానాయక్, జెడ్పీటీసీ కల్యాణి, ఎంపీపీ కమల, ఏఎంసీ చైర్మన్ రజిని, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కృష్ణారావు పాల్గొన్నారు.

మైసమ్మ ఉత్సవాల పోస్టర్ విడుదల

నవాబుపేట: మండల పరిధిలోని పర్వాతాపూర్ మైసమ్మ దేవాలయ ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సోమవారం క్యాంపు కార్యాలయంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో విడుదల చేశారు. ఆహ్వాన పత్రికను నిర్వాహకులు ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగమ్మ, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, గోపాల్, కృష్ణయ్య, నర్సింహులు తదితరులు ఉన్నారు.

‘న్యూరిషి’ విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని న్యూరిషి పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఐఏపీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలంపియాడ్ పరీక్ష స్టేజ్ –1లో ప్రతిభ చాటారు. ఫిజిక్స్ విభాగంలో కే.మేఘా వర్షితా, ఎస్.సాత్విక్‌రెడ్డి, కెమెస్ట్రీ విభాగంలో బి.చరిత, జీ.మనోజ్ఞ, ఎం.వర్షిణి ఉన్నారు. కాగా జాతీయ స్థాయిలో టాప్ టెన్‌లో మనోజ్ఞ, వర్షిణి ఉన్నట్లు చైర్మన్ చంద్రకళావెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు కరస్పాండెంట్ పూజితమోహన్‌రెడ్డి, శిరీషప్రవీణ్‌కుమార్ తదితరులు అభినందించారు.

మౌంట్‌బాసిల్ పాఠశాల విద్యార్థులు..

ఐఏపీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఒలంపియాడ్ పరీక్షలో మౌంట్‌బాసిల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఐదు విభాగాల్లో నిర్వహించిన పరీక్షకు పాఠశాల నుంచి ఫిజిక్స్ విభాగంలో ఐదుగురు, కెమిస్ట్రీ విభాగంలో ముగ్గురు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రకళావెంకట్, కరస్పాండెంట్ పూజిత మోహన్‌రెడ్డి, డైరెక్టర్‌లు శిరీష ప్రవీణ్ కుమార్ అభినందించారు.

ఆత్మీయ సభను విజయవంతం చేయండి

మహబూబ్‌నగర్ రూరల్: సావిత్రిబాయి పూలే జయంతి ఆత్మీయ సభను విజయవంతం చేయాలని కోరుతూ అంబేద్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆదర్శనగర్‌లో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. దేశంలో మహిళల విద్యకు పెద్దపీట వేస్తూ ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు చెందిన స్త్రీలు చదువుకునేందుకు సావిత్రిబాయి పూలే పాఠశాలలు సైతం ప్రారంభించారని తెలిపారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం ఆదర్శనగర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ఆత్మీయ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పరమేశ్వర్, అనిల్‌కుమార్, రాములు, రమేష్, దినేష్, కృష్ణ, దేవన్న, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ అభివృద్ధి శాఖ ఇన్‌చార్జ్ డీడీగా పాండు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎస్సీ అభివృద్ధి శాఖ ఇన్‌చార్జ్ డీడీగా ఏఎస్‌డబ్ల్యూఓ పాండుకు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ వెంకట్రావ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జ్ డీడీగా పాండు బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

ఇన్‌చార్జ్ డీఎండబ్ల్యూఓగా..

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ అధికారిగా టైటస్‌పాల్ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను మైనార్టీలకు అందేవిధంగా తగిన చర్యలు తీసుకుంటానని ఆయన చెప్పారు.

జనపనార బ్యాగులు వినియోగించండి



జడ్చర్ల టౌన్: పర్యావరణ పరిరక్షణకై జనపనార బ్యాగులు వినియోగించాలని 3వ వార్డు కౌన్సిలర్ సతీష్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఉమెన్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, జనపనార బ్యాగుల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగించటం వల్ల భావితరాలకు ఎంతో నష్టం వాటిల్లుతుందని, బాధ్యతగా భావించి వినియోగం పూర్తిగా నిషేధించుకుందామన్నారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు బాలమణి, ఉమ, పారిజాత, శ్రావణి, విజయ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా తెలంగాణ గజిటెడ్ హెడ్‌మాస్టర్స్ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ వెంకట్రావ్ తన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్, తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి అబ్దుల్‌హక్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉద్యోగులు పని చేయాలని అందులోను గెజిటెడ్ అధికారులపై ఎక్కువ బాధ్యత ఉంటుందన్నారు. కొత్త సంవత్సరంలో పాలనను కొత్తగా సాగించేందుకు ఉద్యోగులు కృషి చేయాలన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం



మాట్లాడుతున్న హనీఫ్ అహ్మద్

స్టేషన్ మహబూబ్‌నగర్: రైతు శ్రేయస్సు, సబ్బండ వర్గాల సంక్షేమమే ఏజెండాగా దేశ రాజకీయాల్లో ఆవిర్భవించిన బీఆర్‌ఎస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజలు మద్దతు లభిస్తుందని, ఆ క్రమంలోనే తాను పార్టీలో చేరానని హనీఫ్ అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఈద్గా కమిటీ కార్యదర్శి నూరుల్ హసన్ స్వగృహంలో సోమవారం ముస్లిం పెద్దల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద విధానాలతో దేశం విచ్ఛిన్నమైపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమానికి స్వస్తి పలికారని, కనీస మద్దతు ధర కోసం ఢిల్లీలో పోరాటం చేసిన రైతులు దాదాపు 800 మంది మృత్యువాత పడినా కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను వీడటం లేదన్నారు. వ్యవసాయ మోటార్లకు కరెంట్ మీటర్లు పెట్టి అధిక బిల్లులు వసూలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. దేశంలో అణగారిన వర్గాల హక్కులపై దాడులు కొనసాగుతున్నాయన్నారు. సమావేశంలో రహిమాన్ సోఫి, సమద్‌ఖాన్, అజీజ్, అజార్, మహ్మద్ ఇస్మాయిల్, అమీర్ సోహైల్, సయ్యద్ మహ్మద్, ఇమ్రారుల్ హక్, మహ్మద్ రషీద్, అన్సార్, జమీర్‌పాషా, మహ్మద్ మోజం, సయ్యద్ ఫైజ్, సికందర్, అలీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పదిశాతం స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన వెంచర్లలో కమ్యూనిటీ అవసరాల నిమిత్తం విడిచిపెట్టిన 10 శాతం స్థలాలను కొందరు ఆక్రమిస్తున్నారని మున్సిపల్ పాలక మండలి సభ్యులు సోమవారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్‌కు ఫిర్యాదు చేశారు. కావేరమ్మపేట శివారులో గల వెంకటాద్రినగర్‌లో 10 శాతం స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, ఇప్పటికే వెంచర్ లే అవుట్‌ను మార్చి వేశారని తెలిపారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ లక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఇరుముడి



ఇరుముడి కట్టుకుంటున్న భక్తులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని సంకల్పసిద్ధి హరిహర అయ్యప్ప క్షేత్రంలో సోమవారం అయ్యప్ప మాలాధారులు ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంజన్‌రెడ్డి, శ్రీనివాసులు, రాజుగౌడ్‌తో పాటు మరి కొందరు భక్తులు ఆలయంలో పూజలు చేసి ఇరుముడి కట్టుకుని శబరికి తరలివెళ్లారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తిరుపతయ్య, కొండయ్య, కురుమూర్తి, నరహరి, నరేష్, గంగపూరి, చంద్రమోహన్‌గౌడ్, శరత్‌గౌడ్, నిశాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



మిడ్జిల్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: సర్పంచుల హక్కుల సాధన, పంచాయతీల బలోపేతం కోసం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో సోమవారం చేపట్టిన ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి తదితర నాయకులను పోలీసులు అరెస్టు చేసి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు. సర్పంచ్‌ల హక్కులను హరిస్తున్నదని విమర్శించారు.

జడ్చర్ల: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం తగదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకు ముందు ధర్నాకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మిడ్జిల్: మండల కాంగ్రెస్ నాయకులను సోమవారం ఉదయం ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ అదుపులోకి తీసుకోని స్టేషన్‌కు తలరించారు. డీసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మాట్లాడుతు ప్రభుత్వం అరెస్టులతో ఉద్యమాలను అపలేరని అన్నారు.

మహమ్మదాబాద్/గండేడ్: టీపీసీసీ ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌కు వెళ్లిన సర్పంచ్‌లను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. మండల అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం కేటాయించిన 14, 15వ ఫైనాన్స్ నిధులు ప్రభుత్వమే ఖాతాలను ఖాళీ చేసి మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.